

సబ్ స్టేషన్ కార్యాలయంలోకి పోలీసులు అనుమతించకపోవడంతో గేటు వెలుపల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



పెరిగిన విద్యుత్ బిల్లులను ఏడీకి మళ్ల విజయప్రసాద్ సమక్షంలో చూపుతున్న వినియోగదారులు



ఏపీ ఈపీడీసీఎల్ ఏడీకి వినతిపత్రం అందిస్తున్న మళ్ల విజయప్రసాద్, నాయకులు

సామాన్యులకు షాకిచ్చి.. సంపద సృష్టిస్తారా..?

- అధికారంలోకి వచ్చిన ఆరు **నెలల్లోనే** విద్యుత్ చార్జీల పెంపు దారు**ణం**
- నమ్మిన ప్రజలను వంచించడ**మే** చంద్రబాబు నైజం
- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియో**జకవర్గ** సమన్వయకర్త మళ్ల విజయ**ప్రసాద్**
- 'కూటమి' తీరుకు వ్యతిరేకం**గా** రోడ్డెక్కిన సామాన్యులు
- పోరుబాటకు వైఎస్సార్ సీపీ **శ్రేణుల** సంపూర్ణ మద్దతు

మల్కాపురం : సంపద సృష్టిస్తామని.. **సూపర్ సిక్స్** పథకాలు అమలు చేస్తామని హామీ**లిచ్చి అధికారం**లోకి వచ్చిన కూటమి నాయకులు **కరెంట్ షాక్** ఇవ్వడంతో సామాన్యులు రోడ్డెక్కా**రు. విద్యుత్** చార్జీల పెంపుపై పోరుబాటతో నియోజకవర్గం హోరెత్తింది. తక్షణమే భారం దించకపోతే కూటమి సర్కారుకి షాకిస్తామంటూ నగరవాసులు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కిన జనానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, శ్రేణులు బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఒక్క పైసా కూడా విద్యుత్ చార్జీలు పెంచేది లేదని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ట్రూ అప్ చార్జీల పేరట ప్రజల నడ్డి విరచడం దారుణమన్నారు. ట్రూ అప్ చార్జీల పేరిట పెంచిన విద్యుత్ చార్జీలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని వార్డుల నుంచి కార్యకర్తలు, నాయకులు, కార్పొరేటర్లు మల్కాపురం సబ్‌స్టేషన్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం మల్కాపురం సబ్‌స్టేషన్ ఏడీ ఐ.మాధవికి విజయప్రసాద్ వినతిపత్రం అందించారు.

ఆరు నెలల్లోనే రూ.15 వేల కోట్ల బాదుడు

ఈ సందర్భంగా మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల వల్ల రాష్ట్రంలో గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కరెంట్ చార్జీలు తగ్గిస్తామని, విద్యుత్ ఉత్పత్తి చేసుకుని అమ్ముకునేలా చేస్తామని ఓట్లు దండుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక మాత్రం ఆరు నెలల్లోనే హామీలు మరిచిపోయి ఇప్పటికే రూ.6 వేల కోట్లు రాష్ట్ర ప్రజలపై భారం మోపారన్నారు. జనవరి నుంచి మరో 9,412.50 కోట్ల భారం ప్రజలపై మోపనున్నారని ఆరోపించారు. నమ్మి ఓట్లు వేసిన రాష్ట్ర ప్రజలపై అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15,485.36 కోట్లు చార్జీల రూపంలో భారం మోపడం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు సరికాదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వినియోగదారుడికి రూ.600 బిల్లు వస్తే, ప్రస్తుతం కూటమి పాలనలో ఆ బిల్లు రెట్టింపు అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎస్సీ, ఎస్టీ వర్గం వారికి 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగానికి కరెంట్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదని, కూటమి పాలనలో వారు కూడా వేల రూపాయల చార్జీలు చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు కళ్లు తెరవాలని, పెంచిన చార్జీలు తగ్గించాలని, లేకుంటే ప్రజలంతా తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.వి.సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, ముర్రు వాణి, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, పలు వార్డుల పార్టీ అధ్యక్షులు రేవళ్ల సత్యనారాయణ, జీవీఎస్ఎస్.రాజు (కేబుల్ వాసు), దొడ్డి కిరణ్, శ్యామ్ పూండి మల్లేశ్వరరావు, శరగడం పత్నిరావు, అంగ రామ్ ప్రసాద్, గులిగిందల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఇదెక్కడి న్యాయం బాబూ..?



నమ్మి ఓట్లు వేసిన పాపానికి ఇంత దారుణంగా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం. గతంలో మా ఇంటికి రూ.600 నుంచి రూ.800 మధ్య బిల్లు వచ్చేది. ప్రస్తుతం రూ.2 వేల బిల్లు వచ్చింది. వేసవి కాలంలో అయితే ఏసీలు వాడితే బిల్లు ఎక్కువ వచ్చిందంటే అర్థముంది. చలికాలంలో ఎందుకు ఇంత విద్యుత్ బిల్లులు వచ్చాయో కూటమి నాయకులే చెప్పాలి. ఇదెక్కడి న్యాయమో పాలకులే చెప్పాలి.

– వరలక్ష్మి, మల్కాపురం

నమ్మి ఓట్లేసినందుకు భారం



మా ఇంట్లో ఏసీ లేదు, ఫ్రిజ్ లేదు. అయినప్పటికీ గత నెల విద్యుత్ బిల్లు రూ.1500 వచ్చింది. గతంలో రూ. 400 బిల్లు వచ్చేది. ఇప్పుడు బిల్లు మూడింతలు ఎందుకు పెరిగిందో..? ఎలా పెరిగిందో..? అర్థం కావడం లేదు. అధికారులను అడిగితే ఏమీ చెప్పడం లేదు. నమ్మి ఓట్లేసినా కూటమి నాయకులు సామాన్యులపై భారం మోపడం దారుణం. ఇప్పటికైనా చార్జీల భారం తగ్గించాలి.

– ఎస్.భారతి, మల్కాపురం

చార్జీలు తగ్గించండి మహాప్రభో...



తమలాంటి పేద వారిపై కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం మోపడం సరి కాదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కసారే అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. పెరిగిన చార్జీలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. గతంలో మా ఇంటికి విద్యుత్ బిల్లు నెలకు రూ.500 నుంచి రూ.700 వచ్చేది. గత నెల రూ.1400 చెల్లించాల్సి వచ్చింది.

– లక్ష్మి, మల్కాపురం

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న మలేరియా నివారణ విభాగ అధికారి రవి

మల్కాపురం : దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని, దోమకాటుతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని మలేరియా నివారణ విభాగ అధికారి రవికుమార్ అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వద్ద మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజుల తరబడి నీటి కుండీలపై పైకప్పు లేకుండా ఉంచొద్దని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణలు



నమూనా ప్రాజెక్టు పరిశీలిస్తున్న అతిథులు, ఉపాధ్యాయులు

గోపాలపట్నం : విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు వస్తాయని ఏపీ ఈపీడీసీఎల్ గాజువాక డివిజన్ ఈఈ ఎ.పార్థసారథి అన్నారు. నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థుల సెమిస్టర్ –2024 ఫెస్ట్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యతోపాటు అనుబంధ సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టుల నమూనాలు పరిశీలించారు. మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చైర్మన్ బి.సత్యనారాయణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీ ప్రదీప్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ లేని లోటు తీర్చలేనిది

గోపాలపట్నం : మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ లేని లోటు తీర్చలేనిదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో ఆయన్ను కలిసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ప్రధానిగా మన్మోహన్ విశాఖ పర్యటన సమయంలో స్వాగతం పలికానని గుర్తు చేసుకున్నారు.

'పరీక్షా పే చర్చా'కు రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న డైట్ అధ్యాపకుడు నాగేశ్వరరావు

గాజువాక: జనవరిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించనున్న పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం చేపట్టిన రిజిస్ట్రేషన్‌కు స్పందన లభించింది. ఇప్పటివరకు తమ పాఠశాల ద్వారా 70 మంది ఉపాధ్యాయులు, 700 మంది విద్యార్థులు నమోదు చేయించుకున్నట్టు ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను డైట్ సీనియర్ అధ్యాపకుడు నాగేశ్వరరావు పరిశీలించారు. ఇక్కడ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్న విధానాన్ని స్కూల్ కమిటీ చైర్మన్ నూకరత్నం, ఉపాధ్యాయుడు జనార్దన్ తదితరులు ఆయనకు వివరించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షలపై ఉండే భయం, ఆత్రుత, పిల్లల విద్యా భవిష్యత్ గురించి ప్రధాని ఈ కార్యక్రమం ద్వారా ముచ్చటిస్తారని తెలిపారు.

596 జీవో ప్రకారం ఫ్రీ హోల్డ్ హక్కు కల్పించాలి

సీతంపేట : గత ప్రభుత్వంలో అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల విషయంలో 135 ఎకరాల్లో అవకతవకలు జరిగాయన్నది ఆరోపణ మాత్రమేనని ప్రస్తుత ప్రభుత్వం వేసిన ఏక సభ్య కమిషన్ తేల్చేసిందని నవయానం బహుజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. రామా టాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ నిర్లక్ష్య బాధితులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 596 జీవో ద్వారా గత ప్రభుత్వం సుమారు 300 మందికి సంబంధించిన 609 ఎకరాలకు ఫ్రీ హోల్డ్ హక్కు... అంటే అసైన్డ్ భూమిని అమ్ముకునే హక్కు కల్పించిందన్నారు. ఫ్రీ హోల్డ్ కింద సుమారు నాలుగు వేల ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉందని, ప్రస్తుతం171 ఎకరాలకు మాత్రమే ఫ్రీ హోల్డ్ కింద విక్రయాలు జరిగాయన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల విక్రయాల వల్ల అన్యాయం జరిగిందని ఎవరూ ఇప్పటి వరకు రోడ్డెక్కలేదని, అధికారులకు ఫిర్యాదులు చేయలేదన్నారు. రాజకీయ పార్టీలే తమ స్వార్థం కోసం అన్యాయం జరిగినట్టు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ విచారణతో ఆరోపణలు అవాస్తమని తేలిపోయిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి వెంకటరమణ

తెలుగు భాషను కాపాడుకోవాలి

సీతంపేట : తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, భావితరాలు మాతృభాషకు దూరం కాకూడదని ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. విశ్వ సాహితి లలిత కళా వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం శ్రీగణపతిరాజు ఈశ్వర వర్మ స్మారక సాహిత్య కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మాతృభాష గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను పిల్లలకు వివరించాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రముఖ పాత్రికేయులు జంధ్యాల శరత్‌బాబు పత్రికలు, సారస్వత బాధ్యత అనే అంశంపై మాట్లాడారు. గతంలో వివిధ ప్రక్రియల్లో వచ్చిన రచనలు ప్రచురిస్తూ రచయితలను ప్రోత్సహించడంలో పత్రికలు విశిష్ట భూమిక పోషించాయని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం సాహిత్య పత్రికలు చదివే వారు లేక మూతపడుతున్నాయని, జాతీయోద్యమంలో సాహిత్య పత్రికలు గొప్ప పాత్ర నిర్వహించాయని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న ఆచార్య నాగేశ్వరరావు

యాన్సీన్ వే కన్సల్టెన్సీపై చీటింగ్ కేసు నమోదు

సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఒక కన్సల్టెన్సీ మీద చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోర్టు స్టేడియం సమీపంలో గల గ్రీన్ పార్క్ కాలనీలో యాన్సీన్ వే కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. ఫిర్యాదుదారు పిటాపురపు వెంకటరమణ స్థానిక బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద టీ దుకాణం నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అతని భార్య లావణ్య గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో వారు ఒక పత్రికలో యాన్సీన్ వే కన్సల్టెన్సీ ద్వారా విదేశాల్లో ఉద్యోగాలకు సంబంధించిన ప్రకటన చూశారు. అనంతరం నిర్వాహకులను సంప్రదించడంతో యూరప్‌లోని మాల్టాలో స్టోర్ క్యాషియర్ పోస్ట్ కోసం కొన్ని ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఆ ఉద్యోగం కోసమని యాన్సీన్ వే కన్సల్టెన్సీకి రూ.6.2 లక్షలు చెల్లించారు. ఈ ఏడాది జూన్ 19న విజిటింగ్ వీసా ద్వారా లావణ్యను పారిస్‌కు, ఆపై మాల్టాకు పంపారు. అయితే అక్కడకు వెళ్లిన తర్వాత హౌస్‌కీపింగ్ ఉద్యోగంలో చేర్పడానికి ప్రయత్నించడంతో ఆమె భర్తకు విషయం తెలియజేసింది. వెంటనే వెంకటరమణ యాన్సీన్ వే కన్సల్టెన్సీ నిర్వాహకులు శ్రీనివాస్, రవి కుమార్‌పై ఒత్తిడి తీసుకురావడంతో రూ.1.5 లక్షలు వాపస్ చేశారు. అయితే మిగిలిన రూ.4.70 లక్షలు వాపస్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసుని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పే కన్సల్టెన్సీలతో అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

గోవిందనామాలు.. జీవనముక్తికి సోపానాలు



వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: గోవిందనామాలు జీవనముక్తికి సోపానాలని ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని భద్రం పార్కులో శ్రీ వేంకటేశ్వర వైభవం పేరిట నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమం రెండో శుక్రవారం విశేషంగా సాగింది. ఈ సందర్భంగా విభీషణ శర్మ వేంకటేశ్వర వైభవంపై చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. దేవదేవుడు శ్రీనివాసుడు కొలువైన ఏడుకొండలను సరిగమపదనిసలుగా భావించి మహోన్నత వాగ్గేయకారులైన అన్నమాచార్య, త్యాగరాజు శ్రీవారిని కీర్తించి తరించారన్నారు. వారి బాటలోనే విశ్వవ్యాప్తంగా ఉన్న భక్తులు వివిధ కార్యక్రమాల ద్వారా శ్రీవారిని కీర్తించడం, సేవించడం ద్వారా ప్రశాంత జీవనం పొందగలరని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన వివిధ రకాల వేషధారణలు భక్తులను అలరించాయి. కార్యక్రమ నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక: వివిధ కంపెనీల్లో టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్, డిప్లమో, డిగ్రీ, ఇంజినీరింగ్(బీటెక్) పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. మొత్తం 18 కంపెనీల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తారని చెప్పారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు గుర్తింపు కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ఖాతాదారుల సేవలో ముందుంటాం

విశాఖ విద్య : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కోస్టల్ బ్యాంకు గోపాలపట్నం బ్రాంచి మేనేజర్ యు.తులసీ రావు అన్నారు. కోస్టల్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను శుక్రవారం బ్రాంచిలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా పంచదార్ల శ్రీధర్, ఎంఎంపీ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ సమాజానికి 25 సంవత్సరాలుగా నమ్మకమైన సేవలు అందించిన కోస్టల్ బ్యాంక్ వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కస్టమర్ల విశ్వాసం, ఉద్యోగుల అంకిత భావం మరెన్నో సంవత్సరాలు సేవలందించడానికి ప్రేరణగా నిలుస్తున్నాయన్నారు. సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. పలువురు ఖాతాదారులను సత్కరించి, మెమెంటోలు అందజేశారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కార్మికులు.. యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలి

అక్కిరెడ్డిపాలెం: కార్మికులు బాగుంటేనే యజమానులు బాగుంటారని, వీరిరువురి ఐక్యతతో వ్యవస్థ బాగుంటుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆటోనగర్ వాసీవా భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కంపెనీల్లో జరిగిన ప్రమాదాలపై ఎన్నో న్యాయపరమైన అంశాలు చోటు చేసుకున్నాయన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎం.సునీత మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులకు వర్తించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ వంటి వాటిలో యాజమాన్యం వర్తింప జేయాల్సి అంశాలపై లేబర్ కమీషన్ అనుసరించవల్సిన అంశాలను వివరించారు.

ముందుగా వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు, పరిశ్రమల యజమానులు మధ్య సమన్వయం, కార్మికులకు వర్తింప జేయాల్సిన హక్కులపై వివరణ ఇచ్చారు.

ఫేక్ యాప్‌లో పెట్టుబడి

- లబోదిబోమంటున్న ఉద్యోగులు

ఉక్కునగరం: ఫేక్ యాప్‌లో పెట్టుబడి పెట్టిన ఉద్యోగులు మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. ఉద్యోగుల సమాచారం మేరకు.. ఓ యాప్‌లో పెట్టుబడి పెడితే 54 రోజుల్లో డబుల్ ఇస్తామని నమ్మబలకడంతో అనేక మంది ఉక్కు ఉద్యోగులు పెట్టుబడి పెట్టారు. తొలుత పెట్టుబడి పెట్టిన వ్యక్తికి కేవలం 25 రోజుల్లోనే రెట్టింపు నగదు వచ్చింది. సదరు ఉద్యోగి ఆ విషయాన్ని పలువురికి చెప్పడంతో వారు కూడా ఆశపడి పెట్టుబడి పెట్టారు. ఇది గ్రహించిన యాప్ నిర్వాహకులు మొదట పెట్టుబడి పెట్టిన వ్యక్తికి నెల జీతంలోపాటు ఇతర బెనిఫిట్‌లు ఆఫర్ చేయడంతో అతడు మరింత మందిని చేర్పించాడు. ఈ యాప్‌పై పెట్టుబడులు ఎక్కువగా రావడంతో ప్రోత్సహించిన వ్యక్తులకు భారీ మొత్తంలో యాప్ నిర్వాహకులు ముట్ట చెప్పినట్టు తెలిసింది. ఇటీవల పెట్టుబడి పెట్టిన వారికి నగదు ఇవ్వడం లేదు. ఇదిలా ఉండగా క్రిస్మస ఆఫర్ అని చెప్పి పెట్టుబడి పెట్టిన 15 రోజుల్లోనే రెట్టింపు ఇస్తామని చెప్పడంతో మరింత మంది ఆకర్షితులై పెట్టుబడులు పెట్టారు. వారం రోజుల కిందట నుంచి పెట్టుబడులు పెట్టిన వారి యాప్ పని చేయకపోవడంతో మోసపోయామని గ్రహించారు. కొంత మంది స్టీల్‌ప్లాంట్ పోలీసులను ఆశ్రయించారు. తొలుత పెట్టుబడిన వ్యక్తి వల్లే తాము మోసపోయామని బాధితులు వాపోతున్నారు. దీనిపై స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావును సంప్రదించగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

అమ్మవారికి సారె నివేదన

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులు సారె నివేదించారు. పండ్లు, పిండి వంటలు, స్వీట్లు తదితర సారె సామగ్రిని అమ్మవారి ముంగిట చేర్చారు.



అమ్మవారికి సారె నివేదన

యువతే సమాజానికి దిక్సూచి

మహారాణిపేట: నేటి యువత సమాజానికి దిక్సూచి కావాలని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం 29వ వార్డు హైస్కూల్ ఆవరణలో వీరబాల దివస్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశం కోసం బలిదానాలు చేసిన ఎందరో అమరవీరులను నేటి సమాజానికి, యువతకు పరిచయం చేయటమే లక్ష్యంగా ప్రధాని మోదీ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అబ్దుల్ కలాం, నేతాజీ, ఆజాద్ చంద్రశేఖర్, భగత్‌సింగ్, సుఖదేవ్ వంటి వీరులను స్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో పయనించాలని కోరారు. వీరబాల దివస్‌పై పలు పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రమణి, డాక్టర్ సునీల్‌కుమార్